RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 307 పేజీలు - 04 వెల - 05/- బుధవారం17 జూలై 2024

# అధికారాన్ని అలంకారంగా ఉంచుకోకండి

## మంత్రులకు చంద్రబాబు స్వీట్ వార్నింగ్.!



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 16: ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ క్యాబినెట్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఓటాన్ బడ్జెట్ గడువు ఈ నెలాఖరుకు ముగియనుంది. దానిపై కూడా ఈ భేటీలో చర్చ జరగనుంది. వాటితో పాటు గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు, వాటి వల్ల తలెత్తిన కొన్ని సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వీటి విషయంలో క్యాబినెట్ కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది క్యాబినెట్. వాటిలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, ఉచిత ఇసుక పంపిణీ, బడ్జెట్‌పై చర్చించారు. వీటిలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలోనే ప్రజల భుములకు రక్షణ కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా క్యాబినెట్ చర్చించింది.

దీంతో పాటుగా కొత్త ఇసుక విధానం, పౌరసరఫరాల శాఖ రూ.2 వేల కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారెంటీ వంటి అంశాలకు ఆమోదముద్ర వేసింది క్యాబినెట్. నూతన ఇసుక విధానానికి సంబంధించి త్వరలోనే విధి విధానాలను కూడా రూపొందించనున్నట్లు క్యాబినెట్ సమావేశంలో తేలింది. రైతులు ధాన్యం కొనుగోలు కోసం ఎన్సీడీసీ నుంచి రూ.3,200 కోట్ల రుణానికి వ్యవసాయ, సహకార కార్పొరేషన్‌కు ప్రభుత్వ గ్యారెంటీ ఇవ్వడానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మరికొన్ని కీలక అంశాలకు కూడా క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అసెంబ్లీ సమావేశాలు ఎప్పటి నుంచి ప్రారంభించాలి అన్న విషయంపై కూడా క్యాబినెట్ సమావేశంలో వాడివేడి చర్చ జరిగింది. చివరకు ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని క్యాబినెట్ తీర్మానించింది. సమావేశం ముగిసిన వెంటనే చంద్రబాబు నాయుడు.. మంత్రులతో మరికొన్ని అంశాలపైన కూడా చర్చించి పలు కీలక సూచనలు చేశారు.మంత్రులతో చర్చించి చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం ఈ నెల రోజుల్లో చేసిన పనితీరుపై చర్చించారు. పనితీరును మరింత పెరుగుపరిచేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎప్పటికీ కూడా ఇంత పని చాలు అన్న ధోరణిలో ఉండకూడదని మంత్రివర్గాన్ని ఉత్తేజపరిచారు. ప్రజలకు సమస్యలు ఉన్నంత కాలం మన పని పూర్తయినట్లు కాదని చెప్పారు చంద్రబాబు. అదే సమయంలో రాష్ట్ర ఖజానా పరిస్థితిని కూడా దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను సాగించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం పూర్తిగా లోటు బడ్జెట్‌లో ఉందని, దానికి గ్రహించి ప్రతి ఒక్కరు మసులుకోవాలని వివరించారు. శాఖా పరంగా హెచ్‌ఓడీలతో మంత్రులు ప్రతి నెలా సమీక్షలు చేపట్టాలని, అందులో నెల మొత్తం చేసిన పనులు, ఇంకా జరుగుతున్న పనుల పురోగతి వంటి అంశాలై చర్చించాలని ఆదేశించారు. అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి పూర్తి సమాచారన్ని ప్రజలకు కూడా తెలపాలని చెప్పారు చంద్రబాబు.

మిగతా 2లో

## ఒంగోలులో బాలినేని వర్సెస్ దామచర్ల.!

-చెప్పుతో కొడతానంటూ వ్యాఖ్యానించిన బాలినేని.

-ఇలాగే మాట్లాడితే నీ కొవ్వు దించుతానంటూ జనార్దన్ కౌంటర్.





ఆంధ్ర ప్రగతి ఒంగోలు జూలై 16:

ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి ఈసారి టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపొందగా, బాలినేని శ్రీనివాసరెడ్డి ఓడిపోయారు. తాజాగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఎన్నికల తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన బాలినేని తాజాగా ఒంగోలు వచ్చి కార్యకర్తలతో సమావేశమై టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పై మాటల తూటాలు పేల్చారు. ఏం... మేం చేతకానివాళ్లం అనుకుంటున్నావా... చెప్పుతో కొడతాం అంటూ నిన్న ఓ రేంజిలో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో, బాలినేని వ్యాఖ్యలపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఘాటుగా స్పందించారు. నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరికే వదలం అంటూ హెచ్చరించారు. "జైలుకెళ్లినా రెండ్రోజుల్లో వస్తా, చూస్తా అంటున్నావు... నువ్వేం చూస్తావో మేం కూడా చూస్తాం. నువ్వు (అధికారంలో) ఉన్నప్పుడే పీకలేకపోయావు. ఇప్పుడేం పీకుతావో చూస్తా. కొన్ని మాటలు అనాలంటే సంస్కారం అడ్డొస్తోంది. వయసులో పెద్దవాడివి. ఇంకోసారి వాడు, వీడు అని మాట్లాడు నువ్వు... నీ కొవ్వు దించుతాను. ఏదో గమ్మున ఉంటున్నాం కదా అని రెచ్చిపోతున్నారా? అధికారం అడ్డంపెట్టుకుని నువ్వు, నీ కొడుకు ఎన్ని అరాచకాలు చేశారు? ఆసుపత్రిలో డబ్బులు వసూలు చేయలేదా? గ్రానైట్ లో డబ్బులు వసూలు చేయలేదా? ఒక్కో బార్లోకి వెళ్లి సీసాకు రూ.10 వసూలు చేయలేదా? వైశ్యులకు చెందిన కమర్షియల్ బిల్డింగ్ లకు డబ్బులు వసూలు చేయలేదా?

నాకేం తెలియదు, నా కొడుక్కేం తెలియదు అని ఇప్పుడు మాట్లాడుతున్నారు. మీరు చేసిన పాపాలకు ప్రజలు బుద్ధి చెప్పారు. సంస్కారంతో మాట్లాడడం తెలుసుకో. వచ్చావా... కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పావా... అంతవరకే! ఎన్నికల్లో ఓడిపోయాక కార్యకర్తలకు ధైర్యం చెప్పకుండా ఎందుకు పారిపోయావు? కౌంటింగ్ రోజున మాకు ఇంకా సర్టిఫికెట్ ఇవ్వకముందే నువ్వు 4 గంటలకే వెళ్లి హైదరాబాదులో కూర్చున్నావు... నీలాంటి వాడిపై కార్యకర్తల్లో ఏం విశ్వాసం ఉంటుంది? ఇవాళ వచ్చి కార్యకర్తలకు అండగా ఉంటానని ఎలా చెబుతావు?" అంటూ దామచర్ల జనార్దన్ ధ్వజమెత్తారు.

## టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి నియామకం.!



-వెంకయ్య చౌదరి 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి.

-వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్ పై పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆమోదం తెలిపిన కేంద్రం.

-మూడేళ్ల పాటు ఏపీలో డిప్యుటేషన్ పై పనిచేయనున్న వెంకయ్య చౌదరి.

ఆంధ్ర ప్రగతి తిరుమల జూలై 16:
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన జేఈవోగా చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి నియమితులయ్యారు. ఆయన 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి. వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్ పై పంపాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన డిప్యుటేషన్ పై ఏపీలో మూడేళ్ల పాటు పనిచేయనున్నారు. ఆయన గతంలో ఏపీ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీగా పనిచేశారు.అటు, 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణను కూడా కేంద్రం ఏపీకి పంపించింది. రవికృష్ణ ప్రస్తుతం కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్నారు. ఆకె రవికృష్ణ గతంలో కర్నూలు జిల్లా ఎస్పీగా వ్యవహరించారు.

## ప్రజలు ఛీ కొట్టినా మీకు బుద్ధి రాలేదా..?

-విజయసాయి రెడ్డికి చురకలంటించిన మంత్రి నారా లోకేష్.



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 16:
వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిన్న ప్రెస్ మీట్ లో మీడియా ప్రతినిధులను ఉద్దేశిస్తూ వాడిన భాషపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక మహిళా అధికారితో విజయసాయిరెడ్డికి అక్రమ సంబంధం ఉందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులను అరేయ్, ఒరేయ్ అంటూ మాట్లాడారు. విజయసాయిరెడ్డి వాడిన పదజాలంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. విజయసాయిరెడ్డి గారు... మీపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు పెట్టిన ప్రెస్ మీట్ లో మీరు వాడిన భాష తీవ్ర అభ్యంతరకరమని లోకేశ్ అన్నారు. మీడియా ప్రతినిధులను అసభ్య పదజాలంతో మీరు దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. పెద్దల సభ ప్రతినిధిగా ఉన్న మీకు తాను మంచీమర్యాదల గురించి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. మీకు అధికారం పోయినా అహంకారం మాత్రం ఇంకా తగ్గలేదని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మీ భాష, ప్రవర్తన, అవినీతి, అరాచకం చూసి ప్రజలు ఛీ కొట్టినా ఇంకా మీకు బుద్ధి రాలేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ కు విధివిధానాలు రూపొందించండి

-ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల తగ్గుదలపై మంత్రి ఆందోళన.

-ఉన్నతవిద్య శాఖపై అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష.




2లో

## వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీపై.. రాష్ట్రాలకు సుప్రీం కీలక ఆదేశాలు.!

2లో

## జీపీఎస్ గెజిట్ నిలిపివేత - సీఎం చంద్రబాబు ఆదేశం.!



2లో

## ఆపరేషన్ ప్రారంభమైందా..?

అందుకే చంద్రబాబు ఢిల్లీకి.. జగన్ బెంగళూరుకు వెళ్లాడా.!



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అధికారాన్ని అలంకారంగా ఉంచుకోకండి



అధికారం వచ్చింది కదా అని తలబిరుసుగా ప్రవర్థించవద్దని కూడా మంత్రులకు చంద్రబాబు సూచించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అలంకారంగానే ఉంచుకోవాలి తప్ప అహంకారంగా మార్చుకుని తలకెక్కించుకోవద్దని హెచ్చరించారు. అలా ఎవరైనా చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, దానిని స్పృహలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. మంత్రులు అందరూ కూడా పార్టీ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ఎమ్మెల్యేలతో పంతాలకు పోకుండా సమన్వయంతో మంత్రులు నడుచుకోవాలని హితబోధ చేశారు. మనం ఏ స్థాయిలో ఉన్న మనకు ప్రజల ఆశీస్సులు ముఖ్యమని, వారికి సేవ చేస్తేనే మనకు మనుగడ ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారినే ఎదిరించి నా అంతడి వాడు లేడంటే దెబ్బ కొడుతారని, ప్రజలు కొట్టే దెబ్బ ఎలా ఉంటుందో ఈ ఏడాది జరిగిన ఎన్నికలు చూపించాని, కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రజాప్రతినిధులుగా, ప్రజాసేవకులుగా మెలగాలని సూచించారు.

ఈ సందర్భంగానే మంత్రులకు చంద్రబాబు స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చారు. ఉచిత ఇసుక విధానంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ తలదూర్చొద్దని, అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని చెడ్డ పేరుతెచ్చుకోవద్దని చెప్పారు చంద్రబాబు. "అక్టోబర్ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఇసుక రీచ్‌లు అందుబాటులోకి వస్తాయి. బోట్ సొసైటీలకు కూడా అనుమతిస్తున్నాం. డంప్ యార్డుల్లో 43 లక్షల టన్నుల ఇసుక ఉంది. మూడు నెలల్లో కోటి టన్నుల ఇసుక కావాలి. నదుల్లో పూడిక, బోట్ సొసైటీల ద్వారా 80 లక్షల టన్నుల ఇసుక వస్తుంది. ప్రతి అంశంపై కూడా కొత్త మంత్రులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి" అనిచెప్పారు.

# పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ కు విధివిధానాలు రూపొందించండి.

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 16:
అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ విధానాన్ని అమలుచేసేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్నతవిద్యశాఖ పరిధిలో నెలకొన్న సమస్యలపై మంత్రి లోకేష్ సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విద్యాదీవెన, వసతిదీవెనకు సంబంధించి గత ప్రభుత్వం 3,480 కోట్లు బకాయిలు పెట్టడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు ఆయా విద్యా సంస్థల్లో నిలచిపోయాయని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో డ్రగ్స్ ను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకం అంశాన్ని పరిశీలించాలని అన్నారు. అదేవిధంగా డ్రగ్స్ పై విద్యార్థులను చైతన్యం చేసేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 3220 లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. న్యాయపరమైన చిక్కులను తొలగించి సాధ్యమైనంత త్వరగా పోస్టులను భర్తీచేసేందుకు కసరత్తు చేపట్టాలని అన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా పోస్టుల భర్తీ ప్రక్రియ ఉండాలని స్పష్టం చేశారు. యూనివర్సిటీలకు సంబంధించి అకడమిక్, ఎగ్జామినేషన్ షెడ్యూలు, క్యాలండర్ తయారుచేసి, నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహణ, ఫలితాల ప్రకటనకు చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గత అయిదేళ్లుగా ప్రవేశాలు తగ్గిపోవడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయమై సీరియస్ గా దృష్టిసారించి, అడ్మిషన్ల పెంపుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉన్నత విద్యా సంస్థల వివరాలు, మౌలిక సదుపాయాలు, అడ్మిషన్లు, కోర్టు కేసుల వివరాలు తదితర అంశాలన్నింటినీ డ్యాష్ బోర్డులో పొందుపర్చాలని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజులు ఏమేరకు ఉండాలి, రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల పనితీరు, అప్రెంటీస్ షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ కు కళాశాలల ఎంపిక, రాష్ట్రంలో శ్రీ పొట్టిశ్రీరాములు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల ఏర్పాటు చేసే అంశాలపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఉన్నత విద్య కార్యదర్శి సౌరబ్ గౌర్, కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యశాఖ ఇన్ ఛార్జి చైర్మన్ రామ్మోహన్ రావు, టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ బి.నవ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆపరేషన్ ప్రారంభమైందా..?

## అందుకే చంద్రబాబు ఢిల్లీకి.. జగన్ బెంగళూరుకు వెళ్లాడా.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 16:
బిజెపిలో వైసీపీ రాజ్యసభ పక్షాన్ని విలీనం చేస్తారా? తెర వెనుక ఆపరేషన్ ప్రారంభమైందా? అందుకే జగన్ బెంగళూరు వెళ్ళిపోయారా? చంద్రబాబు ఢిల్లీ టూర్ అందుకేనా? ఈ పరిణామాల క్రమం వెనుక ఉన్న అసలు రహస్యం అదేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వాస్తవానికి జగన్ ప్రజా దర్బార్ ప్రారంభించాల్సి ఉంది. కానీ దానిని వాయిదా వేసి బెంగళూరు వెళ్లారు. కాలికి వైద్యం చేయించుకుంటారని బయటకు చెబుతున్నారు. కానీ తెర వెనుక చాలా తతంగం జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఢిల్లీ నుంచి బిజెపి ఆపరేషన్ ప్రారంభమైనట్లు తెలుస్తోంది.




రాజ్యసభలో బిజెపికి బలం తగ్గింది. 90 కంటే కిందకు పడిపోయింది. ఎన్డీఏ పరంగా మెజారిటీ ఉన్నా.. కీలక బిల్లుల విషయంలో ఆమోదం పొందాలంటే ఆ బలం చాలదు. ఒకవేళ బిల్లులు వెనక్కి వస్తే మాత్రం రాజకీయంగా బిజెపికి ఇబ్బందికరమే. అందుకే బిజెపి బ్రహ్మాస్త్రంతో ముందుకెళ్తున్నట్లు సమాచారం. వైసీపీ రాజ్యసభ సభ్యులను బిజెపిలో చేర్పించుకునేందుకు పెద్ద స్కెచ్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైసీపీకి రాజ్యసభలో వీర విధేయులు ఉన్నారు. కొంతమంది అనామకులు సైతం కొనసాగుతున్నారు. అయితే అటువంటి వారిపైన ఇప్పుడు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 11 మందిలో.. వై వి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి లాంటి వారిని విడిచిపెట్టి.. మిగతా వారిని లాగేసే పనిలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. 6 నుంచి ఏడుగురు రాజ్యసభ సభ్యులను లాక్కుంటే ఆటోమేటిక్ గా వైసీపీ రాజ్యసభ పక్షం బిజెపిలో విలీనం కాక తప్పదు.అయితే బిజెపి ప్రయత్నానికి జగన్ నిస్సహాయత తోడవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజ్యసభ సభ్యులను జగన్ నియంత్రించరు. తనపై ఉన్న కేసుల దృష్ట్యా దీనికి సహకరించినా ఆశ్చర్యపోనవసరం లేదు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది. కేవలం 23 స్థానాలకే పరిమితమైంది. నాడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు చంద్రబాబు. ఆ భారీ ఓటమితో బిజెపి నుంచి ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని అంచనా వేశారు. అందుకే తెలుగుదేశం పార్టీ నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులను బిజెపిలో చేర్పించారు. అందులో తనకు అత్యంత నమ్మకస్తులైన సీఎం రమేష్, సుజనా చౌదరి ఉన్నారు. వారే ఇప్పుడు టిడిపితో బిజెపి జత కట్టడానికి కారణమయ్యారు. బిజెపిలో చేరి టిడిపి ప్రయోజనాల కోసం పాటుపడ్డారు. ఇప్పుడు అదే ఫార్ములా తో ముందుకు సాగుతున్నారు జగన్. పార్టీ రాజ్యసభ సభ్యులను స్వచ్ఛందంగా బిజెపిలోకి పంపించిన ఆశ్చర్యపోనవసరం లేదు.ఒకవేళ వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యులను బిజెపిలో చేర్చుకుంటే.. బిజెపి అగ్రనాయకత్వం కచ్చితంగా చంద్రబాబు అభిప్రాయం తీసుకుంటుంది. అయితే నిన్నటి వరకు చంద్రబాబు టూర్ అధికారికంగా ఖరారు కాలేదు. కనీసం ఢిల్లీ పర్యటన ఉంటుందని కూడా ఎవరికి తెలియదు. అటువంటిది ఈ అకస్మాత్తు పర్యటన వెనుక.. వైసీపీ రాజ్యసభ పక్షం బిజెపిలో విలీన ప్రక్రియ కారణమని తెలుస్తోంది. కేవలం రాజకీయ అంశాలను చర్చించేందుకే చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నారని.. అమిత్ షా తో చర్చలు జరుపుతారని తెలుస్తోంది. వైసిపి రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరే విషయంలో చంద్రబాబు ఎటువంటి అభ్యంతరాలుపెట్టరని కూడా సమాచారం.కేవలం కేంద్ర ప్రభుత్వం సజావుగా నడిచేందుకు, సుస్థిర పాలన అందించేందుకు ఈ నిర్ణయం కీలకమని బిజెపి నేతలు భావిస్తున్నారు. చంద్రబాబు సైతం దీనిని ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది.అటు జగన్ సైతం రాజ్యసభ సభ్యులను కాపాడుకునే స్థితిలో లేరు. పైగా తనపై అక్రమాస్తుల కేసులతో పాటు బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుఎదురుగా కనిపిస్తోంది. ఏమైనా తోక జాడిస్తే బిజెపి ఏ స్థాయిలో ఇరుకున పెడుతుందో జగన్ కు తెలియంది కాదు. అందుకే ఆయన రాజ్యసభ సభ్యులను కాపాడుకోవడానికి గానీ, బిజెపిలో చేరకుండా నియంత్రించడానికి కానీ వీలు లేని పరిస్థితి. పార్టీ శ్రేణులు, సామాన్య జనాల నుంచి వినతులు స్వీకరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తామని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. ఈరోజు నుంచి జగన్ తో ఆ కార్యక్రమం నిర్వహించాలని గ్రాండ్ ప్లాన్ చేశారు. కానీ జగన్ ఉన్నపలంగా బెంగళూరు పయనమయ్యారు. ఈ ఆపరేషన్ విషయం తెలిసి ఆయన బెంగుళూరు వెళ్లిపోయారని తెలుస్తోంది. ఢిల్లీ కేంద్రం గా జరిగే తంతు పూర్తయ్యాక తిరిగి ఆయన ఏపీకి చేరుకునే అవకాశం ఉంది. వైసీపీలోని 11 మంది రాజ్యసభ సభ్యులకు గాను సగానికి పైగా బిజెపిలో చేరతారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే వైసీపీ రాజ్యసభ పక్షం బిజెపిలో విలీనమైనట్టే. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జీపీఎస్ గెజిట్ నిలిపివేత

## - సీఎం చంద్రబాబు ఆదేశం.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 16:
జీపీఎస్ జీవో, గెజిట్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ గెజిట్ జారీ కావడంపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఇప్పుడెందుకు బయటపెట్టారో విచారించాలని ఆర్థికశాఖ అధికారులకు ఆదేశించారు.
ఏపీ గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్ ఉత్తర్వులు తక్షణం నిలిపి వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆర్థిక శాఖ సమీక్షలో దీనిపై సీఎం చంద్రబాబు అరా తీశారు. ఇపుడు ఏపీ జీపీఎస్?పై గెజిట్ ఎలా విడుదల అయ్యిందని చంద్రబాబు ఆరా తీశారు. గత ప్రభుత్వ ప్రతిపాదనలతో ప్రస్తుతం ఉత్తర్వులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తెలియకుండా గెజిట్ ఎలా విడుదల చేశారన్న అంశంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే ఆ ఉత్తర్వులు నిలిపివేయాలన్నారు.కాగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం సీపీఎస్? (కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం) స్థానంలో జీపీఎస్?ను (గ్యారంటీట్ పెన్షన్ స్కీమ్) అమలులోకి తెస్తూ తీసుకున్న నిర్ణయంపై గత నెల 12న అప్పటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్-ఎస్ రావత్ సంతకం చేశారు. ఆయన సెలవుపై వెళుతూ పెండింగ్ దస్త్రాలన్నింటిపైనా సంతకాలు చేశారు. వాటిలో జీపీఎస్ దస్త్రం సైతం ఉంది. జూన్ 12వ తేదీన జీవో 54ను విడుదల చేయగా, పాత ప్రభుత్వంలోనే రూపొందించిన నోటిఫికేషన్‌ను కొద్ది రోజుల క్రితం గెజిట్‌లో అప్‌లోడ్ చేశారు. జీపీఎస్ 2023 అక్టోబరు 20 నుంచి అమల్లోకి వస్తుందని దానిలో పేర్కొన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి, గతేడాది అక్టోబరు నుంచి అమల్లోకి వస్తుందనడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేశారు. జీపీఎస్ అమలుకు, నాడు విధివిధానాలు రూపొందించకుండా కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నోటిఫికేషన్ ఇవ్వడమేంటని మండిపడ్డారు.అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పథకం తీసుకొస్తానని 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పదేపదే ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక భారం పేరుతో సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకుని వచ్చారు. దీన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించినా, పట్టించుకోకుండా వైఎస్సార్సీపీ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకంగా చట్టం చేసింది. ఎన్నికల ముందు దీనిపై ఉద్యోగుల్లో వ్యతిరేకత వస్తుందని అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వంలో పాత జీఓకు అనుగుణంగా నోటిఫికేషన్ ఇవ్వడం, జీపీఎస్ అమలుకు ఇంతవరకు మార్గదర్శకాలే రూపొందించకపోవడం గమనార్హం.

# వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీపై.. రాష్ట్రాలకు సుప్రీం కీలక ఆదేశాలు.!



ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ జులై 16: రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆలస్యం చేస్తున్న రాష్ట్రాలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రాష్ట్రాలు రేషన్ అందించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు మాత్రమే వారికి రేషన్ కార్డుల జారీ కోసం 100శాతం వెరిఫికేషన్ పూర్తి చేశాయి.పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ విషయాన్ని సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాక, కార్డులు జారీ అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలు కార్మికులకు రేషన్ అందజేయడం లేదని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు రేషన్ రావట్లేదని ఆయా రాష్ట్రాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది."ఇది చాలా దురదృష్టకరమైన విషయం. నాలుగు నెలలైనా వెరిఫికేషన్ ప్రక్రియను ఎందుకు పూర్తిచేయలేదు. ఇప్పుడు మరో రెండు నెలలు గడువు కావాలని అడుగుతున్నారు. దీన్ని మేం ఆమోదించలేం. నాలుగు వారాల్లోగా అన్ని రాష్ట్రాలు వలస కార్మికుల వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలి. ఒకవేళ రాష్ట్రాలు విఫలమైతే.. ఆయా కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తాం" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం17 జూలై 2024

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచండి

-మెనూ ప్రకారం ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించండి.

-మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పై జాగ్రత్తలు తీసుకోండి.

-విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచండి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా







ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 16:
పాణ్యం మండలం నెరవాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రిన్సిపల్ మేరీ సలోమిని ఆదేశించారు. మంగళవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నెరవాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లన్నీ భర్తీ చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పదవ తరగతిలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన సీట్లన్నీటిని భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటూ విద్యార్థుల డ్రాపవుట్స్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే గిరిజన ప్రాంతాలకు వెళ్లి తల్లిదండ్రులను మోటివేట్ చేస్తూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలను విద్యార్థులకు ఎలాంటి లోపాలు లేకుండా అందించాలన్నారు. విద్యార్థులకు టాయిలెట్లు, బాత్రూంలు, త్రాగునీటి సౌకర్యం తదితర వసతుల కల్పనలో లోపాలు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంటుందని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల గదులన్నిటిని పరిశీలిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే ఆహార పదార్థాల మెనూను తనిఖీ చేస్తూ వంటగదిలో వున్న ఆహార ధాన్యాల నాణ్యతను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తూ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. జిల్లా యంత్రాంగం నుండి ఏదైనా సహకారం కావాలని కలెక్టర్ అడగగా.... గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ మేరీ సలోమి రెసిడెన్షియల్ పాఠశాలకు రెండు డార్మెటరీలు అవసరం ఉందని కలెక్టర్ కు నివేదించారు. అలాగే ఇన్వర్టర్ జనరేటర్, మస్కిటో మెష్ సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ను కోరారు. పాఠశాలలో స్పోర్ట్స్ కు సంబంధించి కోచ్ ఉందని విద్యార్థులు ఆడుకునేందుకు అనువుగా పాఠశాల మైదానాన్ని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను సాధించుకునేంతవరకు పోరాటాలు కొనసాగిస్తాం



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 16:
భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు సాధించుకునేంతవరకు నంద్యాల జిల్లాలో పోరాటాలు కొనసాగిస్తామని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా జనరల్ బాడీ సమావేశం లో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ సీఐటీయూ నంద్యాల జిల్లా కమిటీని ఏకీగ్రవంగా ఎన్నుకోవడం జరిగింది నంద్యాల జిల్లా అధ్యక్షులుగా ఎస్.కె భాష జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి ,బాల వెంకట్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాముడు కోశాధికారిగా వీరన్న ఉపాధ్యక్షులుగా తిమ్మయ్య జలీల్ భాష, జాకీర్ హుస్సేన్ వలి, సహాయ కార్యదర్శిగా రసూల్, మౌలాలి, అబ్దుల్ జాకీర్, కమిటీ సభ్యులుగా రహంతుల్లా,రషీద్, నరసింహ, రమణ, కరీం బాషా, అల్లా బకాష్ శేషుల, సుబ్బయ్య, నూర్ మహమ్మద్,లతోపాటు 26 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నుకున్న జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ కే భాష వి బాల వెంకట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాముడులు మాట్లాడుతూ..భవన నిర్మాణ కార్మికులకు సహజ మరణానికి ప్రమాద మరణానికి అంత్యక్రియలకు కార్మికుని ఆడపిల్లల పెళ్లిళ్లకు ప్రసూతి సహాయంగా రెండు కాన్పులకు క్లైములు ఇచ్చేవారు అని చెప్పినారు ఇప్పుడు పనులు ఇవ్వడం వల్ల ఈ పథకాలన్నీ ఆగిపోయాయని వాటిని వెంటనే పునరుద్ధరించాలని అలాగే నంద్యాల జిల్లాలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి ఉచిత ఇసుక ఇవ్వాలని జిల్లాలో పెండింగ్ లో ఉన్న క్లెయిమ్ లకు వెంటనే బడ్జెట్ కేటాయించి డబ్బులు ఇవ్వాలని లేబర్ గుర్తింపు కార్డులో కార్మిక ప్రతి కార్మికులకు అందించాలని కార్మిక శాఖలకు బడ్జెట్ కేటాయించాలని ఈ సమస్యల కోసం జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

## రెడ్ క్రాస్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థినికి సైకిల్ పంపిణీ.

-ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ .



ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 16:
నంద్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై నిరుపేద బాలికకు కాలేజీకి వెళ్లడానికి అవసరమైన 6000 రూపాయలు విలువైన సైకిల్ ను విరాళంగా అందజేశారు. నంద్యాల పట్టణం మిషన్ కాంపౌండ్ ప్రాంతానికి చెందిన నిరుపేద అభిషేకమ్మ కూతురు మాధురి పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలై ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ కోసం చేరింది. రోజు కళాశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సమయంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండి మారుతి కుమార్ దృష్టికి తీసుకురాగా ఆయన సహకారంతో ఫిరోజ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ పార్ట్నర్స్ సుధా మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, సెవెన్ హిల్స్ హాస్పిటల్ సిబ్బంది ప్రేమ్ కుమార్, మురళి, రాజశేఖర్, టిడిపి నాయకులు బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అలాగే సెవెన్ హిల్స్ హాస్పిటల్ మారుతి కుమార్ కూడా చాలా సేవా కార్యక్రమాలకు సహకారం చేస్తున్నారని, భవిష్యత్తులో వీరి సహకారంతో పట్టణంలోని వైద్యులు స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో అందరి భాగస్వామ్యంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నంద్యాల పట్టణంలోని నిరుపేద ప్రాంతాలకు చెందిన ప్రజలకు అందేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మారుతికుమార్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా రెడ్ క్రాస్ తరఫున తన వంతు సహాయ సహకారాలు కచ్చితంగా అందజేస్తానని ఫిరోజ్ తెలియజేసిన విధంగా నిరుపేద ప్రజల కోసం వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తానని తెలిపారు.

## ఉపాధి మార్గాలను అన్వేషించండి.

-కొత్త యూనిట్లతో ముందుకు రండి. -నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించండి.

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 16:
నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి మార్గాలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కల్పనా అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్ ఛాంబర్ లోని ఉపాధి కల్పన, స్వయం ఉపాధి మార్గాలపై జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి తదితరులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఆసక్తిగల రంగాలలో నైపుణ్యం గల శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గాలను అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వయం ఉపాధి రంగాలలో ఉన్న అవకాశాలను గుర్తించి నియోజకవర్గాల వారీగా యూనిట్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే సమావేశానికి తీసుకురావాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఏమి చేయగలమో అన్వేషించాలన్నారు. అగరబత్తుల తయారీ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, పికిల్ ఇండస్ట్రీస్, మిల్లెట్ బిస్కెట్ల తయారీ తదితర ఉపాధి రంగాల యూనిట్ల స్థాపనకు అవసరమైన వనరులను గుర్తించి నూతన ప్రాజెక్టులతో ప్రతిపాదనలు తీసుకురావాలన్నారు.
జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముమ్మరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. డోన్ లో ఉన్న మోడల్ కెరీర్ సెంటర్ ను నంద్యాల జిల్లా కేంద్రానికి తీసుకొచ్చేందుకు సరైన కారణాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను పటిష్ఠం చేసి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా జాబ్ మేళాలు నిర్వహించి శిక్షణ ఇచ్చిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

## ఒకే రోజులో ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించేలా రూట్ మ్యాప్ లను సిద్ధం చేయండి



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 16:
జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో సమీప పుణ్యక్షేత్రాలను సందర్శించే రీతిలో సంబంధిత క్షేత్రాల విశిష్టతను, చక్కటి ఫోటోలను పెద్ద హోర్డింగ్ ల ద్వారా భక్తులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని టూరిజం అధికారులను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, టూరిజం అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ వచ్చే శ్రావణ, కార్తీక మాసాలలో జిల్లాలోని పుణ్యక్షేత్రాలలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుందని ఈ మేర జిల్లాలోని దేవాలయాల అన్నింటిని ఒక సర్క్యూట్ గా ప్యాకేజీగా తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా టూరిజం అధికారిని ఆదేశించారు. పర్యాటక రంగ ఆధీనంలోని రెస్టారెంట్లు, వసతి గృహాలలో పర్యాటకులు మెచ్చే రీతిలో అభివృద్ధి చేయాలన్నారు. ఒకే రోజులో నవనందులు, రెండు లేదా మూడు ప్రముఖ పుణ్యక్షేత్రాల ప్యాకేజీని ఒకేరోజు సందర్శించి వచ్చే విధంగా రూట్ మ్యాప్ తయారు చేయాలన్నారు. బెలూమ్ గుహలకు సమీపంలో ఉన్న పురావస్తు శాఖ వారి యానిసన్ రాతి వనాల వనాలను సందర్శించే రీతిలో అభివృద్ధి చేయాలన్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం పాతాళ గంగలోని ప్రైవేట్ బోటు ప్రయాణానికి సంబంధించి పర్యాటక శాఖకు చెల్లించే రుసుమును 12 శాతం నుంచి 10 శాతానికి తగ్గించేందుకు కమిటీ సభ్యులతో కలెక్టర్ అంగీకరించారు. నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు పార్కులో తినుబండారాల రేట్లు, బోటింగ్ రేట్లు అధికంగా ఉన్నాయన్న ఆరోపణల దృష్ట్యా ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతలు, పర్యాటక శాఖ అధికారులతో విచారణ జరిపించి రేట్లు నిర్ధారించి ఫైల్ సర్క్యులేట్ చేయాలని ఆదేశించారు. అలాగే చిన్న చెరువు గట్టు సమీపంలో రోడ్డు మార్గాన ఉన్న గ్యాప్ లో ప్రమాదాలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎస్టిమేట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. యాగంటి, అవుకు, ముచ్చుమర్రి, సంగమేశ్వరం ప్రాంతాలలో ఉన్న పర్యాటక శాఖకు సంబంధించి ఉన్న వసతి గృహాలు, డార్మెటరీలు, రెస్టారెంట్లను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి లీజుకు ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టూరిజం అధికారిని సత్యనారాయణ ఆదేశించారు. నంద్యాలలో హరిత హెూటల్ నిర్మాణనికి అవసరమయ్యే రెండు ఎకరాల స్థలాన్ని గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ను సూచించారు. నంద్యాలలో నగరవనం ఏర్పాటుకు అవసరమయ్యే అటవీ భూములను గుర్తించి సంబంధిత ప్రతిపాదనలను సమర్పించాలని అటవీ శాఖ అధికారులను సూచించారు. జిల్లాలో పర్యాటకశాఖ ఆధీనంలో ఉన్న స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. జిల్లాలోని ప్రాచీన సంస్కృతులు, నృత్య ప్రదర్శనలు ఇతర సాంస్కృతిక రంగాల సంబంధించిన సాంప్రదాయ కళలనుగుర్తించి ప్రమోట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు టూరిజం ప్రమోట్ చేసే విధంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించడంతోపాటు చక్కటి ఫోటోలను పోస్ట్ చేసే విధంగా వెబ్సైట్ ను క్రియేట్ చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఇరిగేషన్, విద్యా, ఫారెస్ట్, టూరిజం, పరిశ్రమలపై అవగాహన కలిగేలా విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, ఎస్సీ ఇరిగేషన్ వెంకటరమణ, డి ఎస్ డి ఓ రాజు, డి ఎఫ్ ఓ శివ శంకర్ రెడ్డి, డివిఎం చంద్రమౌళి, టూరిజం అడ్మిన్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.




అమరావతి ఆంధ్ర ప్రగతి జూలై 16: ఆంధ్రప్రదేశ్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్ అందించింది. ఎస్సీ, ఎస్టీ, డ్వాక్రా మహిళలకు రుణ పరిమితిని రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షల వరకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. కనిష్టంగా రూ. 50వేల నుంచి రూ. 5లక్షల వరకు వడ్డీలేని రుణాలను డ్వాక్రా మహిళలకు అందిస్తారు. డ్వాక్రా మహిళలకు ఈ రుణాన్ని వాయిదా రూపం లో తిరిగి చెల్లిస్తారు. 2024- 25 ఏడాదికి సంబంధించి రూ. 250కోట్లు రుణంగా ఇవ్వాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ ఫైల్ పై ఎమ్ ఎస్ఎమ్ఈ , సెర్ప్, ఎన్ ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతకం చేశారు. ఈ ఉన్నతి పథకం కింద రుణం మంజూ రుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. డ్వాక్రా సంఘా ల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలు ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న నెలలో యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో గ్రామసంఘం స్థాయి నుంచి అన్ని దశ ల్లోనూ పర్యవేక్షణ ఉంటుం ది. అలాగే లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న జీవనోపా ధికి అనుగుణంగా రుణంమంజూరుచేయనున్నారు. ఏ జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలనేది డ్వాక్రా మహిళల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది.

# వివోఏలపై రాజకీయ వేధింపులు ఆపాలి




ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 16:
వివో ఎ ల పై రాజకీయ వేధింపులు ఆపాలని వివో ఎలా మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కిలర్ ను రద్దు చేయాలని హెచ్ ఆర్ పాలసీని అమలు చేయాలని గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏపీ వెలుగు వివోఏ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా వి వో ఏ ల సంఘం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె. సోమన్న అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి, ఏసురత్నం ఏ, నాగరాజు వి వో ఏల సంఘం రాష్ట్ర కోశాధికారి ఏ తిరుపతయ్యలు పాల్గొని మాట్లాడుతూ.. వి ఓ ఎ లా ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాళ్ల పరిమితి సర్కులర్ను రద్దు చేయాలని రాష్ట్రంలో 28 వేల మంది వివోఏ లు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలికంగా సేవలు చేస్తున్నారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడు సంవత్సరాలు వివోఏలుగా పని చేస్తున్నటువంటి వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని 2019 నవంబర్లో సర్కులర్ జారీ చేశారు వీటితోపాటు రాజకీయ కారణాలు చూపుతూ తమ అనుచరులను వివోఏలుగా పెట్టాలని ఉద్దేశంతో అక్రమ తొలగింపులకు తెర లేపారని వీటికి వ్యతిరేకంగా పోరాడి కొంతమందిని నిలుపుకున్నప్పటికీ కొంతమందిని భయభ్రాంతులకు గురిచే చేయడం ద్వారా వారిని తీసివేయడం జరుగుతా ఉందని ఎన్నికల కంటే ముందు వివోఏలు మూడు మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కులర్ ను రద్దు చేయాలని, వివో ఏలపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగిస్తున్న వారిని తక్షణమే నిలిపివేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వివోఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, వారికి పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, చదువుతో వయస్సు జండర్ పేరుతో తొలగింపులు చేయరాదని వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఐదు సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్నటువంటి టిడిపి ప్రభుత్వం మేము చేసే ధర్నాల దగ్గరికి వచ్చి ధర్నాలో పాల్గొని అధికారంలోకి వస్తే మీకు వేతనాలు పెంచుతాం రాజకీయ వేధింపులు ఉండవు. మీకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పినటువంటి నాయకులే కక్షగట్టి దుర్మార్గంగా అన్యాయంగా తీసివేయడం ఈ ప్రభుత్వానికి తగదని, కాబట్టి ఇప్పటికైనా వివోఏలపై రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

# శ్రీజగజ్జననీ అమ్మవారికి బెంగుళూరు వాసులు పుట్టింటి పట్టుచీర, సారే



ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 16:
నంద్యాల పట్టణంలో వెలసి ప్రపంచంలో రెండవ దేవాలయంగా ఉంటూ నిత్య పూజల్లో మొదటి స్థానంలో నిలిచిన శ్రీజగజ్జననీ అమ్మవారికి ఆషాడ మాసం పూజలు భక్తిశ్రద్దలతో జరుగుతున్నాయి. మంగళవారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, రాష్ట్ర నలుమూలలు రాజంపేట, మేడ్చల్, ఆదోని, కర్నూలు, గుంటూరు, జమ్మలమడుగు, నిమ్మకూరు, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుంచి నంద్యాలకు చేరుకొని పట్టణంలో వెలసిన శ్రీ జగజ్జనని అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలు, నేతిమిఠాయిలు, పూలు, పండ్లు, కుంకుమ, పసుపు, చీర, రవికే, ఆకు వక్కలు తదితర పూజా సామాగ్రిని అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. మేళా తాళాలు, భజంత్రీ, కోలాట నృత్యాలతో అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారే సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు నాగపుల్లయ్య, దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులకు అమ్మవారి కుంకుమార్చన, దర్శనంతో పాటు వసతి, ఫలహారం, అన్నదానం కల్పించారు.

# వాసంతిని అత్యాచారం చేసి చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలి: సిపిఐ




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 16:
నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామం లో ఈనెల 7వ తేదీ ఆదివారం ఆడుకోవటానికని బయటికెళ్లిన 5వ తరగతి చదువుతున్న వాసంతి అనే 9 సంవత్సరాల అమ్మాయి ని అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తీసుకుని పోయి హత్యాచారం చేసి వారి తల్లిదండ్రులకు చెప్తానని భయంతో వాసంతిని హత్య చేసి పక్కనే ఉన్న కాలువలో వేయడం అమానుషము. దుర్మార్గమైన చర్య అని ఇంతటి దురాగతానికి పాల్పడిన బాలురను ప్రోత్సహించిన తల్లిదండ్రులను పోలీసు ప్రభుత్వ అధికారులు కఠినంగా శిక్షించాలని సిపిఐ గోస్పాడు మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక మండలంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి. జి హరినాథ్ మండల సహాయ కార్యదర్శి జిలాని భాష సిపిఐ పార్టీ నాయకులు మౌలా.మహిళా సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక మిస్సింగ్ కేసులో ముగ్గురు బాలురులు అదుపులోనికి, ఇద్దరు అరెస్టు

## -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 16:
నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామం నుండి ఒక 9 సం. ల బాలిక అడుకోవటానికి పార్కు కు వెళ్ళి తిరిగి ఇంటికి రానందున ఆమె తండ్రి సంగెం చిన్న మద్దిలేటి, పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్ ఇచ్చారు.దానిపై అదే రోజు మిస్సింగ్ కేసు నమోదు చేయడమైనది. అప్పటినుండి మైనర్ బాలిక ఆచూకీ కనిపెట్టుట కొరకు నంద్యాల జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు డీఎస్పీ అధర్వంలో గాలింపు చర్యలు చేపట్టడమైనది.విచారణ చేస్తుండగా తప్పిపోయిన అమ్మాయి పై ముగ్గురు మైనర్ అబ్బాయిలు హత్యాచారం చేసి అమ్మాయిని చేతులతో గొంతు నులుమి చంపివేసినట్లు తరువాత కొంత దూరం సైకిల్ పై మరియు మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని అలాగే ఆ అమ్మాయి శవాన్ని కృష్ణా నది బ్యాక్ వాటర్ లో వారి తండ్రుల సహాయంతో శవానికి రాయి కట్టి నదిలో పడవేసినట్లు ప్రాథమిక దర్యాప్తు లో తెలిసినది. దానిపై కర్నూల్ డిఐజి నంద్యాల జిల్లా ఎస్పీ మరియు అడిషనల్ ఎస్పీ ముచ్చుమర్రి గ్రామం లోనే మకాం వేసి గాలింపు చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించినారు.ఈ గాలింపు చర్యలలో సీఐ స్థాయి అధికారులను 6 టీమ్స్ గా ఏర్పాటు చేసి గజ ఈత గాళ్ల ద్వారా మరియు ఎస్ డి ఆర్ ఎఫ్ మరియు ఎన్ డి ఆర్ ఎఫ్ టీమ్, లను, 06 స్పెషల్ పార్టీ బృందాలు,డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు, టెక్నికల్ టీమ్ లను రంగం లోకి దింపి గాలింపు చర్యలు చేపట్టగా మైనర్ బాలిక ఆచూకీ లభ్యం కాలేదు.ముగ్గురు మైనర్ బాలురను వారి తల్లి తండ్రుల ద్వారా అదుపులోనికి తీసుకోవడమైనది.అలాగే ఆ అమ్మయి శవాన్ని లభ్యం కాకుండా నదిలో పడవేసినట్లుగా ప్రాథమిక దర్యాప్తు లో తెలిసినందున కాటం. యోహన్, బొల్లెద్దుల .సద్గురుడు లను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడమైనది.పై బృందాలన్నియు అమ్మాయి ఆచూకీ కొరకు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

# దోడా జిల్లాలో ఉగ్రవాదుల దాడి

## : నలుగురు జవాన్లు మృతి



శ్రీనగర్: గుడివాడ మెయిల్, జూలై 16:
జమ్మూ కశ్మీర్‌లో దోడా జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు అమరులయ్యారు. దెస్సా ప్రాంతంలో గత రాత్రి భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో అధికారితో సహా నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. దెస్సా ప్రాంతంలో తీవ్రవాదులు సంచరిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. గత వారం కథువా జిల్లా మాచేడీలో సైనివాహనంపై తీవ్రవాదులు కాల్పులు జరపడంతో ఐదుగురు జవాన్లు మృతి అమరులైన సంగతి తెలిసిందే. జమ్ము కశ్మీర్ గత రెండున్నర సంవత్సరాల నుంచి 40 మంది సైనికులు చనిపోయారు.

# మైనార్టీ పరిరక్షణ సమితి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.



ఆంధ్రప్రదేశ్ విజయవాడ జులై 16:
విజయవాడలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని వారు అనుకున్నా లక్ష్యాలను చేరాలన్నారు . మైనార్టీల ఎదుగుదలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండదండగా ఉంటుందన్నారు . మైనార్టీలో ఏదైనా వ్యాపారం చేసుకోవాలన్న వారికి బ్యాంకుల ద్వారా లోన్లు ఇవ్వడం గానీ , ఇంటి దగ్గర ఉండి చిన్నచిన్న కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకున్న వారికి చేదోడు వాదోడుగా ఉండడం ఒక తెలుగుదేశం పార్టీకే చెందుతుందన్నారు . 2024 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి అత్యంత భారీ మెజారిటీ చేకూర్చిన ముస్లిం మైనార్టీ ప్రజలకు అందరికీ రుణపడి ఉంటానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సుజన చౌదరి , పినమలూరు ఎమ్మెల్యే బోండా ప్రసాద్ , రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఏబి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో ఉచిత బస్సు పథకం ముహూర్తం ఫిక్స్..



అమరావతి గుడివాడ మెయిల్, జూలై 16:
ఏపీ ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. ఆగస్టు 15 నుంచి మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారికంగా వెల్లడించారు. అమరావతిలో ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడుతూ, ఉచిత బస్సు ప్రయాణ పథకం విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామని ఆయన చెప్పారు. %ఇది ఇలా ఉండగా, ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తర్వాత సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఉచిత బస్సు పథకంపై కీలక ప్రకటన వెల్లడైంది. దీంతో ఎప్పుడు అమల్లోకి వస్తుందా అని ఎదురుచూస్తున్న మహిళలకు శుభవార్త రానే వచ్చేసింది.
ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంది. దీంతో ఏపీ అధికారులు ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించి పథకం అమలవుతున్న తీరును పరిశీలించారు. ప్రధానంగా జీరో టికెట్ విధానంపై రెండు రాష్ట్రాల్లో అధ్యయనం చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, రూట్లకు అనుగుణంగా ఈ పథకాన్ని అమలు చేయాలనే అంశంపై అధికారులు ఫోకస్ పెట్టారు. ఇప్పటికే ఓ నివేదిక సిద్ధం చేశారు. ఇక ఉచిత బస్సు ప్రయాణ పథకం వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం : వెంకయ్యనాయుడు

## రైతు రుణమాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం అభినందించిన వెంకయ్యనాయుడు



అమరావతి గుడివాడ మెయిల్, జూలై 16:
తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా, పరిపాలనకు సంబంధించిన అంశాలు తెలుగులో జారీ చేయాలని ఎప్పటినుంచో సూచిస్తున్నానని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తాజాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం అని తెలిపారు.
"ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు... ప్రజలకు సులువుగా అర్థమయ్యే భాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించిన సమాచారం ఉండాలని నేను ఎప్పటినుంచో చెబుతున్నాను. ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యతనిస్తూ, తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు గారికి, ఈ ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇతర అధికారులు, సిబ్బందికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇక నుంచి అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు.